# ఓటమి-గెలుపు

అర్ధరాత్రి ...

పన్నెండుకు పది నిమిషాలు తక్కువ.

ఉలిక్కిపడ్డట్టు లేచాడు ప్రతాపరెడ్డి.

నిద్రపట్టక సతమతమవుతున్న వసంత - భర్తను గమనించింది పక్కమీదినుంచే.

మంచం దిగి, కొక్కేనికి తగిలించి ఉన్న లాల్చీ జేబులోనుంచి సిగిరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తీసుకొని, గబగబా మెట్లెక్కి డాబాపైకి చేరుకున్నాడు రెడ్డి.

అతను మెట్లెక్కుతుండగానే బయటికొచ్చి, వసారాలో పడుకున్న నర్సింహను లేపబోయింది వసంత.

"మేల్కొనే ఉన్నానమ్మా ..." అప్రమత్తంగా ఉన్న నర్సింహ లేచి కూర్చుంటూ, వసంత మనసు కుదుటపడే మాటన్నాడు "నేను పటేల్‌ను కనిపెడ్తూనే ఉన్నాను. మీరు బేఫికర్‌గ పండుకోండి ..." అంటూ నెమ్మదిగా డాబాపైకి వెళ్ళడానికి సిద్ధమయ్యాడు.

ఆమె - వాడి స్వామిభక్తికి మనసులోనే ముచ్చటపడుతూ లోపలికి వెళ్ళింది. ఈ అలికిడికి మేల్కొన్న ప్రతాపరెడ్డి తల్లి - డెబ్బైయేళ్ళ పార్వతమ్మ 'ఏం జరిగిం'దని కళ్ళతోనే కోడలినడిగింది. సమాధానంగా ఓ నిట్టూర్పు విడిచి, పక్కగదిలోకి తొంగిచూసింది వసంత. పిల్లలిద్దరూ ప్రశాంతంగా నిద్రపోతున్నారు.

వారంరోజులుగా ఆ ఇంట్లో ఎవ్వరికీ కంటిమీద కునుకులేదు. 'ప్రశాంతంగా పట్నంలో

హాస్టల్లో ఉండి చదువుకుంటున్న పిల్లలిద్దర్నీ ఇంటికితెచ్చి, గృహ నిర్బంధంలో ఉంచారు. ఆ పిల్లలు రెండ్రోజులు తమ నాయనమ్మ మీద ఎగిరిపడ్డా, తర్వాత పరిస్థితిని అర్థం చేసుకున్నారు. వాళ్ళూ నిన్న మొన్నటిదాకా సరిగ్గా నిద్రపోలేదు. ఈరోజే ఆదమరచి నిద్రపోతున్నట్టున్నారు.


ఇంతటి గంభీర వాతావరణానికి నేపథ్యం – ఓటమి. ఒకే ఒక్క ఓటమి ... అనుకోని ఓటమి ... పదకొండు ఓట్ల తేడాతో ... తప్పని ఓటమి ... ప్రతాపరెడ్డి జీవితంలో మొట్టమొదట ఓటమి ... పన్నెండేళ్ళ ఏలుబడికి చుక్కపెట్టిన ఓటమి ... సర్పంచ్‌గా ప్రతాపరెడ్డి ఎదురుచూడని ఓటమి.

అందుకు ప్రతీకారంగా ఊరు ఊరంతా తగలబడిపోతుందని ఊహించారంతా. ప్రత్యర్థి నారాయణరెడ్డి మనుషులు సగంమంది ఖతమైపోతారన్న పుకార్లు వ్యాపించాయి. వాటికి తగ్గట్టే, ఫలితాలు వెలువడ్డ గంటలోనే ఎంతో విధ్వంసం సృష్టించారు ప్రతాపరెడ్డి మనుషులు, అతని అభిమానులు. నారాయణరెడ్డి సహనం, పోలీసుల జోక్యం పరిస్థితిని వెంటనే అదుపులోకి తెచ్చాయి. గ్రామమంతా ప్రశాంతంగా మారిపోయింది. కానీ ఏ క్షణాన్నయినా ఏరూపంలోనైనా దాడులు-ప్రతిదాడులు జరుగుతాయన్న ఉద్రిక్తత మాత్రం తగ్గలేదు – వారంరోజులైనా.

సముద్ర గర్భంలో బడబానలంలా ప్రతాపరెడ్డి గుండెలో ఎన్ని అగ్ని పర్వతాలున్నాయో ఎప్పుడు పేలుతాయో ఎవ్వరికీ తెలియదు. ఓట్ల లెక్కింపు సమయంలో ప్రారంభమైన మౌనవ్రతం ఇంకా కొనసాగుతోంది. ఇంటా బయటా ... ఇప్పటివరకూ అతను పెదవి విప్పనేలేదు. అది మరింత అనుమానానికీ భయానికీ ఊతమిస్తోంది. కన్నతల్లినీ సంతానాన్నీ అర్ధాంగినీ అనుచరగణాన్నీ ... ఎవ్వరినీ ఇప్పటివరకూ తన చూపుల్తో తడమలేదు, మాటల్తో పరామర్శించలేదు. పద్నాలుగేళ్ళనాడు కన్నతండ్రి చనిపోయినప్పుడు అతడ్నిలా చూశారు. మళ్ళీ ఇప్పుడే.

నారాయణరెడ్డి తన మనుషులను అప్రమత్తం చేశాడు. ప్రతాపరెడ్డి మనుషుల మీద నిఘా ఏర్పాటు చేశాడు. ఏ క్షణంలో ఎటువంటి ఉపద్రవమొచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాడు.

నిజానికి వీళ్ళిద్దరిమధ్యా ఏ వైరమూ లేదు. ఇద్దరూ ఒకే ఇంట పుట్టి పెరిగిన అన్నదమ్ముల బిడ్డలు. రాజకీయమే వాళ్ళను ప్రత్యర్థులుగా చేసింది. అంతకంటే, రెండు ప్రధాన రాజకీయ పార్టీలే వాళ్ళను అనుకోని శత్రువులుగా మార్చాయి. అప్రతిహతంగా



సాగుతున్న ప్రతాపరెడ్డి పాలనను అడ్డుకునేందుకు ఒక పార్టీవాళ్ళు నారాయణరెడ్డిని చేరదీసి, ప్రత్యర్థిగా నిలిపారు. అయినా ప్రతాపరెడ్డే గెలుస్తాడని భావించారంతా. కానీ రాత్రికి రాత్రే పరిస్థితి తారుమారయింది. ధనం, మద్యం తమ ప్రభావాన్ని చూపాయి. నారాయణరెడ్డిని సర్పంచ్‌ని చేశాయి.

"ఏరా ! చస్తాననుకుంటున్నారా ?"

ఉలిక్కిపడ్డాడు నర్సింహ - ప్రతాపరెడ్డి మాటలకు. అందుకు రెండు కారణాలు. మూతపడ్డ తన యజమాని గొంతు విచ్చుకోవడం, గమనించలేదనుకున్న తనను కనిపెట్టేసెయ్యడం.

కొయ్యబారిపోయిన నర్సింహ చీకట్లో తలవంచుకొని నిలబడ్డాడు, తప్పు తెలుసుకొన్నట్లు.

"వెళ్ళిపో !" ప్రతాపరెడ్డి సుగ్రీవాజ్ఞ.

వాడు నిశ్శబ్దంగా చీకటిలో కలిసిపోయాడు. సద్దుచేయకుండా మెట్లుదిగి యథాస్థానానికి చేరుకున్నాడు.

సిగిరెట్టు వెలిగించుకొని, గట్టిగా దమ్ములాగి వదిలాడు. ఆకాశం మబ్బుపట్టి ఉంది. కురవదు, వదలదు – అతని హృదయంలాగే.

'ఓటమికి కారణాలు వెతుక్కోవడం అనవసరం అనుకొంటుంటే, అతని ఆలోచనలు నారాయణరెడ్డి వైపు మళ్ళాయి. తనను ఓడించిన ప్రత్యర్థిగా కాదు, తన సిద్ధాంతాలకు నప్పని ప్రతిపక్షపార్టీ వ్యక్తిగా కాదు ...

అసలు ఆ నారిగాడెవడు ? స్వయానా నా తమ్ముడు ! తనకంటే పదేళ్ళు చిన్నోడు. చిన్నప్పుడు తనే భుజాలమీద ఎత్తుకొని తిరిగాడు వాణ్ణి. తన చేతులతోన గోరుముద్దలు తినిపించాడు వాడికి. బడిలో వాణ్ణి మేస్టారు కొడితే తిరగబడి, హెడ్మాష్టరు చేత తన్నులు తిన్నాడు. మునగచెట్టు కొమ్మలో ఇరుక్కున్న గాలిపటంకోసం వాడేడుస్తుంటే, అది తీయబోయి, కిందిపడి నుదుటిమీద గాయం చేసుకున్నాడు. 'కన్నా ! నువ్వుంటే చాలురా ... వాడికీ లోకంలో దేవుడు కూడా అవసరంలేదు' అంటూ పిన్ని తనను ముద్దుపెట్టుకున్న రోజు మరిచిపోగలడా ! కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

తాము పెద్దవాళ్ళవుతూండగానే తమ పెద్దలు వేరయ్యారు. తమ తండ్రులు అన్నదమ్ముల స్థాయి నుండి దాయాదుల స్థానానికి మారిపోయారు. పొలాలూ ఇళ్ళూ ఆస్తులూ మర్యాదలూ రెండుగా చీలిపోయాయి. వేరయిన కొత్తలో తమ్ముడు అన్నతోనే ఉంటానని అమ్మపక్కలో పడుకున్నాడు. అమ్మకు వాడంటే ప్రాణమే. నాన్నకు ఇంకా ఎక్కువ. కానీ బాబాయి బలవంతంగా వాణ్ణి లాక్కొని వెళ్ళాడు. పిన్ని ఉన్నా పరిస్థితి ఇంతగా దిగజారేది కాదేమో ! ఆమె మరణం బాబాయిని మరింత రాక్షసుడిగా మార్చింది. తనకు జరిగే ప్రతి నష్టానికీ తమనే కారకుల్ని చేస్తూ – వాణ్ణి తమకు పూర్తిగా దూరం చేశాడు. పట్నం హాస్టల్‌లో చేర్పించడంతో తమ మధ్య అగాథం పూడ్చుకోలేనంత పెరిగింది. పెళ్ళిళ్ళూ పేరంటాలకూ కలుసుకోకుండా చేసింది. నాన్న పోయినప్పుడైనా వాడు దగ్గర కాలేదు. అంత్యక్రియలకు కూడా చుట్టపుచూపే. అది తన పేగుల్ని మెలేసింది. వాణ్ణింకెప్పుడూ తలచుకోరాదన్నంత మొండివాడిగా మార్చింది.

ఇది రాజకీయ నాయకులకు అవకాశంగా మారింది. ఈ ఊళ్ళో మంచి పలుకుబడి గల కుటుంబం తమదే. తనకు పోటీగా తమ్ముణ్ణి నిలబెట్టే పరిస్థితులు తెచ్చింది.

నిజానికి తనకెవరూ పోటీలేరు. అందుకు కారణం - చిత్తశుద్ధితో గ్రామాభివృద్ధికి పాటుపడటమే. ఆర్తులకూ పేదవాళ్ళకూ సాయం చేయడంకోసం వెనకా ముందూ చూడకుండా డబ్బు ఖర్చుపెట్టడం నాన్ననుండి తనకు సంక్రమించిన సుగుణం. ప్రభుత్వం నుండి నిధులు వచ్చినా రాకున్నా గ్రామాభివృద్ధికోసం తన శాయశక్తులా పాటుపడటం తననూ తిరుగులేని నాయకుణ్ణి చేసింది. తన గ్రామం మేలు తప్ప, మరే రాజకీయలబ్ధీ ఆశించని తనను ప్రజలు కూడా నెత్తిన పెట్టుకున్నారు. అందుకే ఇంతవరకు 'ఓటమి' అనే మాటే తెలియదు తనకు.

కానీ జరగకూడనిది జరిగింది. ఇందులో తమ్ముడి ప్రమేయం ఎంతవరకుందో ? పార్టీ ప్రమేయం మాత్రం బలంగా ఉంది. ఇంత అలజడికి పార్టీల వైషమ్యాలే కారణం. మరి తనను కుంగదీస్తున్న బాధ .... ఇది తామిద్దరినీ ... ఇంకా బద్ధశత్రువులుగా మారుస్తుందా ? అయితే ... శత్రుశేషం, ఋణశేషం ఉండకూడదు.

వేలికొసలకొచ్చిన సిగరెట్ చురుక్కుమంది.

* * *

"ఆయన చాలా కోపంమీదున్నట్టున్నాడన్నా ! వారం రోజులుగా ఎవ్వరితోనూ మాట్లాడ్డం లేదట. నామాట వినండి. ఓ నాల్గురోజులు ... ఎక్కడికన్నా వెళ్ళిపోండి !" నారాయణరెడ్డి కుడిభుజం శివయ్య ప్రతాపరెడ్డి గురించిన సమాచారం అందించాడు.

సమాధానంగా ఓ నవ్వు నవ్వాడు నారాయణరెడ్డి. అతనప్పుడే స్నానం చేసి, టిఫిన్ చేయడానికి సిద్ధమవుతున్నాడు.

భార్య వర్ష వేడివేడి జొన్నరొట్టెలు, సొరకాయ చట్నీ, టొమాటో కూర, ముద్దపప్పు వడ్డించింది. శివయ్య మాటలు వింటూంటే ఆమె మనసులో ఆందోళన మరింత పెరిగింది.

"శివయ్య చెప్పేది విన్నారా ! మనకెందుకండీ ఈ రాజకీయాలు ? ఏదో కాంట్రాక్టుల్లో వస్తున్న లాభాలు చాలు. ఎన్నికల కోసం లక్షలు ఖర్చు చేశారు. ఇప్పుడు చూడండి ... ! క్షణం క్షణం - భయం భయం ! బావగారెలాంటి మనిషోనాకు తెలీదు. మన జాగ్రత్తలో మనముండటం మంచిది ..."

అరే ! నువ్వు నోర్మూస్తావా ?" భార్యను మందలించాడు నారాయణరెడ్డి. "మా

అన్న గురించి మీకు తెలియకపోవచ్చు. కానీ నాకంతా తెలుసు ..." హఠాత్తుగా అతని కళ్ళు చిప్పిల్లాయి. గత స్మృతుల స్పర్శ రక్తంలో కదలాడింది.

వాతావరణం గంభీరంగా మారిపోయింది.

తుంచిన రొట్టెముక్క నోట్లోకెళ్ళడానికి మారాం చేసింది. యాంత్రికంగా దాన్ని కూరలో కెలకసాగాడు నారాయణరెడ్డి.

"అన్నా ! ఈరిగాడ్ని, రావుడ్ని, చంద్రిగాడ్ని,సాదిక్‌ను పిలువుండ్రి. ప్రతాపరెడ్డి పటేలు మనింటికే వొస్తున్నడు ..." ధోనీ బ్యాట్ తాకిడితో ఉరుకులుపెట్టే బంతిలా పరుగెత్తుకొచ్చాడు బందయ్య.

అప్పుడే మొదటి ముద్ద నోటపెట్టుకున్న నారాయణ రెడ్డికి పొలమారింది. బందయ్య మాటలు పూర్తిగా తలకెక్కముందే ప్రతాపరెడ్డి నట్టింట్లోకొచ్చాడు.

ముందుగా కోలుకున్న శివయ్య, సహచరులను పిలిచేందుకు ఓ మనిషిని తరిమాడు. పనిలో పనిగా బందయ్యకు లోపలిగదికెళ్ళి ఆయుధాలు సరిచేయమని సైగచేశాడు.

ప్రతాపరెడ్డి వెంటవచ్చిన నర్సింహ, ఆయన ఆజ్ఞననుసరించి తలవాకిటనే ఆగిపోయాడు. కానీ ఒళ్ళంతా కళ్ళు చేసుకొని పరిసరాలను పర్యవేక్షిస్తున్నాడు. ప్రతాపరెడ్డికి తెలియకుండానే పదిమందిని కర్రలతో, గొడ్డళ్ళతో నారాయణరెడ్డి వాళ్ళ ఎదురింట్లో సిద్ధంగా ఉంచాడు.

"నారీ !" ఇంట్లోకొస్తూనే పిలిచాడు ప్రతాపరెడ్డి. తమ్ముణ్ణి రెండు దశాబ్దాలకింద ముద్దుగా పిలుసుకున్న పిలుపది. ఈ పిలుపులో ఆనాటి మార్దవం లేదు ... ఆత్మీయత కనిపించడం లేదు. కానీ ఏదో ఆర్ద్రత దాన్ని చుట్టుకొని వచ్చింది.

నారాయణరెడ్డి ఒక్క గెంతులో అన్న ముందు ప్రత్యక్షమయ్యాడు ఎంగిలిచేత్తోనే. 'అన్నా!' అంటూ ఆ గుండెలో తలదాచుకోవాలనిపించింది ఒక్కక్షణం. అంతలోనే నిగ్రహించుకొని నిలబడ్డాడు నిటారుగా.

వర్ష గుండెల్లో పిడుగుపడింది. ఆమె కాళ్ళూ చేతులాడటం లేదు. ఎదలో ప్రకంపనలు క్రమక్రమంగా శరీరమంతటా పాకుతున్నట్లనిపించసాగింది.

"ఎన్నికల్లో నువ్వు గెలిచావు. కానీ నేనోడిపోలేదు. ఓడిపోయింది - ప్రజాస్వామ్యం, న్యాయం, ధర్మం ! ఏదేమయినా నువ్వే ఇప్పుడు సర్పంచ్‌వి. ప్రజలకోసం పనిచెయ్యి. జెండాల రంగులకు మోసపోకు. ఎవ్వరికీ లొంగి బతకకు. నా తమ్ముడు ... నాకంటే గొప్పోడని పించుకోవాలె ..." ప్రతాపరెడ్డి కంఠం రుద్ధమైంది.

నారాయణరెడ్డి గుండె బరువెక్కింది.

"ఏనాడూ ఎలక్షన్ల కోసం నేను పైసలు ఖర్చు పెట్టలేదు. కానీ ప్రతి సంవత్సరం నా వంతుగా రెండు లక్షలు ఖర్చు చేయడం అలవాటు. అందుకే గ్రామంలో ఈనాడిన్ని సౌకర్యాలున్నాయి. ఆ డబ్బులు ఈ సంవత్సరం కోసం కూడా తీసిపెట్టాను. నర్సింహతో పంపిస్తా - మన ఊరికోసం ఖర్చు చెయ్యి. పైసకు తలవంచకు ... మంచికి తలవంచు. ఇది మా నాయన జెప్పిన మాట. అదే నువ్వూ నేనూ నడుచుకోవాల్సిన బాట".

వచ్చినంత వేగంగా వెళ్ళిపోయాడు ప్రతాపరెడ్డి.

* * *

భోరున వర్షం కురుస్తోంది.

మధ్యాహ్నం జల్లులు జల్లులుగా మొదలైన వాన సాయంత్రానికి కుంభవృష్టిగా మారింది. ఆరోజంతా నారాయణరెడ్డి ఎవ్వరినీ దగ్గరకు రానీయలేదు. సెల్‌ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి, భార్యను కూడా డిస్టర్బ్ చేయొద్దని చెప్పి, తన గదిలో పడుకున్నాడు.

ఒక్కసారి అన్న ఎదురుపడగానే, అతని పిలుపు వినగానే ... ఏదో మార్పు ...అది గుండె లోతుల్లోని చెమ్మను తాకింది. చిన్ననాటి జ్ఞాపకాల ఊటల్ని తోడింది. అన్న మంచితనాన్నీ నిజాయితీని అమాయకత్వాన్నీ అద్దంలా చూపింది. నిన్నటిదాకా అతనేం గొప్ప ? నేనంతకంటే అద్భుతాలు చేసి చూపిస్తా. అసలు ఆయనకు వ్యవహారమే తెలియదు ... నిధులు రాబట్టడం తెలియదు. పైస్థాయి వాళ్ళతో పరిచయాల్లేవు ...'అంటూ అన్నను తక్కువచేసి, తన విజయ విన్యాసాలను తలచుకొని తలచుకొని పొంగిపోయింది తనేనా అనిపిస్తోందిప్పుడు నారాయణరెడ్డికి.

పార్టీ నాయకుల మాటలకు తలవొగ్గి, దేవుడిలాంటి అన్నయ్యకి ఎదురు నిలబడ్డాడు.

కుటుంబ కలహాలు దశాబ్దాల కింద తమను వేరుచేసినా రాకపోకలు లేకపోయినా ... అన్నపట్ల, ఆయన వ్యక్తిత్వం పట్ల ఎప్పుడూ గౌరవమే తనకు. కానీ ఎందుకలా తను రెచ్చిపోయాడో అంతుచిక్కదు. మొదట ఎలాగూ ఓటమి తప్పదనుకున్నా, తర్వాత పార్టీ, ప్రతిష్ఠ అనే పాకులాట తనలోని తనను మాయంచేసి, ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవాలనే మొండి పట్టుదలను పెంచేసింది. 'అడ్డమైన' ప్రయత్నాలన్నీ చేసేలా ప్రేరేపించింది. చివరకు విజయాన్ని తెచ్చిపెట్టింది. అన్నయ్యన్నట్టు నిజంగా అది గెలుపా ? కాదు ...

చీకటి గదిలో దీపం వెలిగించింది వర్ష.

నెమ్మదిగా భర్త మంచం వద్దకు చేరుకొని, అతని నుదుటిపై చెయ్యివేసి చూసింది. వెచ్చగా అనిపించింది.

"జ్వరమా ?" అనునయంగా అంది.

"... ..." సమాధానం చెప్పలేదు నారాయణరెడ్డి. ఆలోచన కబంధ బంధనం అతణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తూంది.

"లేవండి ! ఈ సమయంలో పకోడీలు తినడానికిష్టపడ్తారు కదా ... రండి ! వేడివేడిగా చేసిపెడ్తాను ..." వాతావరణాన్ని తేలికచేసే ప్రయత్నం వర్షది. భర్త చేయి పట్టుకుంది.

"వర్షా ! నాకీ సర్పంచ్ పదవి వద్దు. నువ్వన్నట్టు మనకేం లోటు ? హాయిగా కాంట్రాక్టుల్తో బతికేద్దాం ..." నారాయణరెడ్డి ఒక్కోమాట తడితడిగా ... విడివిడిగా.

ఆశ్చర్యపోయిందామె. భర్త అట్లా మాట్లాడటం నమ్మలేకపోయింది. "సింహం గుగ్గిళ్ళు తింటుందా ? అన్నట్లుంది ఆ పరిస్థితి. ఉదయం సరిగ్గా ఇదే మాటన్నది తను. కొన్ని మాటలు కొందరి వన్నెను ఇనుమడింపజేస్తాయి. మరికొన్ని మాటలు కొందరి స్థాయిని దిగజారుస్తాయి. ఆయనట్లా మాట్లాడుతున్నారంటే ... ఎం[illegible] సంఘర్షణకు లోనైఉంటారో అర్థమవుతూంది.

"అన్నీ తర్వాత మాట్లాడుకుందాం లేవండి !"

కొన్ని ఆలోచనలు ఏకాంతంలో పెడదారి పడతాయి. ఆయన్ని మనుషుల్లో పడేయడమే ప్రస్తుత కర్తవ్యం అనుకుంది.

అతను కదల్లేదు. అనవరతంగా సాగుతున్న ఆలోచనా స్రవంతి అతన్ని వదల్లేదు. ఛ! రాజకీయాలెంత నీచానికి దిగజారుస్తాయి ? అందుకే మద్యంకన్నా మగువకన్నా అధికారం ఇచ్చే 'కైపు' జీవితకాలమంతా ఉంటుందన్నాడో మహానుభావుడు. అన్నకోసం ఒక తమ్ముడు పద్నాలుగు సంవత్సరాలు అడవుల్లో గడిపాడు. అన్నమీద భక్తి కలిగిన మరోతమ్ముడు రాచరికాన్ని తృణప్రాయంగా భావించి, ఆయన పాదుకలకే పట్టాభిషేకం చేసి, సేవకవృత్తి నిర్వహించాడు. అటువంటి పవిత్రభూమిలో జన్మించిన నేను ... శ్రీరామచంద్రుని వంటి అన్నయ్యమీద కుట్రలతో కుతంత్రాలతో ... అతని కళ్ళ నుండి అశ్రుధారలు.

అది గమనించింది వర్ష. తట్టుకోలేకపోయింది.

"ఏవండీ ! ఏంటండీ ఇది ? మీరేమాలోచిస్తున్నారో నేనూహించగలను. కానీ మీరిప్పుడాలోచించాల్సిన విషయం కాదిది. ఈ పని రాజకీయాల్లోకి దిగక ముందే చేయాల్సింది. మీరిప్పుడు నిమిత్తమాత్రులే నండీ ! మీ ముందూ వెనకా చాలా శక్తులున్నాయి. వాటిననుసరించే మీరు కానీ ... అవి మిమ్మల్ననుసరించవు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మీ బాధ్యతలనెట్లా నిర్వహించాలో అది ఆలోచించండి ..."

కురుక్షేత్రంలో అర్జునుడికి కృష్ణుడిలా అనిపించింది ఆ క్షణంలో నారాయణరెడ్డికి వర్ష.

నిజమే ! అన్న ఆశయాలకు ఆలోచనలకూ ధీటుగా గ్రామాన్ని చక్కదిద్దాలి. అన్న ఎప్పుడూ చేసే ఖర్చుకు తనవంతు వాటా కూడా కలపడమేగాక, నిధులన్నీ చక్కగా రాబట్టుకొని, పార్టీల రంగుల మరకలు కనబడకుండా, ఊరంతా ఒక్కటేనన్న రీతిగా ఒక కొత్త వాతావరణాన్ని సృష్టించాలి. 'మా తమ్ముడు నారిగాడు నాకంటే గొప్పోడు' అని అన్నచేతనే శభాషనిపించు కోవాలి. అన్నకు తగ్గ తమ్ముడై తమ రెండు కుటుంబాలను కలపాలి.

"శివయ్య వాళ్ళు మీకోసం ఎదురు చూస్తున్నారు. రండి !" భర్త మొహంలో మార్పులు గమనిస్తున్న వర్ష అతన్ని కర్తవ్యోన్ముఖుణ్ణి చేస్తూ సంతృప్తిగా బయటికి కదిలింది.

❀❀❀

(ఈనాడు, ఆదివారం 10,సెప్టెంబర్ 2006)